క్లుప్తంగా

ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలి

జన్నారం: చింతగూడ గ్రామ పంచాయతీ పాపమ్మగూడ పరిధిలోని సర్వే నంబర్ 18/1లో గల 20ఎకరాల ప్రభుత్వ భూమిని ఇల్లు లేని నిరుపేదలకు పంచాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పురంశెట్టి బాపు డిమాండ్ చేశారు. మండలంలోని చింతగూడ గ్రామంలో బుధవారం పేదలతో కలిసి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి రమాదేవి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సికిందర్, చింతగూడ, గ్రామస్తులు ఉన్నారు.

జీవో తొలగించాలని వినతి

పాతమంచిర్యాల/భీమారం: ఉపాధిహామీ పథకంలో 4779జీవోను వెంటనే రద్దు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క రాజన్న బుధవారం డీఆర్డీవో కిషన్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని అందరికీ కేటగిరీకి సంబంధం లేకుండా నెలకు రూ.26వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నక్క రాజన్న, జిల్లా గౌరవాధ్యక్షుడు ఈద లింగయ్య, ప్రధాన కార్యదర్శి బుక్యా భూమా, ఉపాధ్యక్షుడు రేగుంట సతీష్ పాల్గొన్నారు.

'మీడియాపై వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్న'

మంచిర్యాలటౌన్: కొత్త రేషన్‌కార్డు, రైతు భరోసా సంబురాలను మంచిర్యాల పట్టణంలో ఇటీవల నిర్వహించిన సమయంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాపై తను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నానని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో తాను శక్తి వంచన లేకుండా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేస్తున్నానని, కానీ మీడియాలో కవరేజ్ తక్కువగా ఉండడంతోనే బాధతో మాత్రమే ఆ వ్యాఖ్యలను చేయాల్సి వచ్చిందని తెలిపారు. మీడియాపై తనకు అపారమైన గౌరవం ఉందని, తాను చేసే అభివృద్ధికి, సంక్షేమానికి మీడియా వెన్నుదన్నుగా నిలవాలని కోరారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి

జన్నారం: పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. మండలంలోని కొత్తపేట, కస్తూర్బా పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈవో విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని టౌన్ 2, ఏసీసీ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్-2 ఏఈ శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల మార్కెట్ ఏరియా, ఇక్బాల్ అహ్మద్‌నగర్, ఇందిరానగర్, జాఫర్‌నగర్, జన్మభూమినగర్, హైటెక్‌సిటీ, గ్రీన్‌సిటీ, ఏసీసీ ఏరియా, శ్రీనివాస గార్డెన్ ఏరియా, సావిత్రినగర్, వికాస్‌నగర్, లక్ష్మీనగర్, గౌతమినగర్, ఇస్లాంపుర, అండాలమ్మకాలనీ, రాళ్లపేట్, డీసీపీ ఆఫీస్‌లలో ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన తెలిపారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోండి

మందమర్రిరూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా పట్టభద్రుల ఓటరు నమోదు కోసం గడువు పెంచిందని ఈ అవకాశాన్ని పట్టభద్రులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. మండలంలోని పాఠశాలలు, కళాశాలలు తిరిగి పట్టభద్రులను కలిశారు. ఇప్పటివరకు ఓటరు నమోదు చేసుకోని వారు తహసీల్దార్ కార్యాలంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థుల పొలంబాట



పొలంలో నాటు వేస్తున్న విద్యార్థినులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ శాంతిఖని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం పొలం బాటపడ్డారు. నాట్లు వేసే పద్ధతిని ఉపాధ్యాయులు కూలీలతో కలిసి విద్యార్థులకు వివరించి అవగాహన కల్పించారు. గురిజాలకు వెళ్లే రహదారి పక్కన ఉన్న సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ఉద్యాన వన కేంద్రాన్ని సందర్శించారు.

నిఘా నిరుపయోగం



పనిచేయని సీసీ కెమెరాలు | పర్యవేక్షణ లేక గ్రామాల్లో భయం భయం | పట్టించుకోని పోలీసు అధికారులు

భీమారం: గ్రామాల్లో గతంలో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఐదేళ్ల క్రితం పోలీసులు ప్రజల సహకారంతో 11గ్రామపంచాయతీల్లోని ప్రధాన వీధులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా, ప్రస్తుతం అవి పనిచేయకపోవడంతో గ్రామాల్లో భద్రత పై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంలో పోలీసులు కొన్ని రోజుల నుంచి 'కమ్యూనిటీ పోలీస్' అనే పేరుతో నిఘా నేత్రాలపై అవగాహన కల్పించినా ఆశించిన ఫలితాలు కానరావడం లేదు.

పాత కెమెరాలతో ఫలితాలు కరువు..

గతంలో గ్రామాల్లో ఏర్పాటు చేసిన కెమెరాలతో ఫలితాలు ఉండే పరిస్థితి లేదు. అప్పట్లో ఉన్న కెమెరాల్లో ఫోటోలు, వీడియోల్లో క్వాలిటీ ఉండదని పలువురు చర్చించుకుంటున్నారు. కొత్తతరం సీసీ కెమెరాల ఏర్పాటు కోసం పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నిఘా నేత్రాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేస్తే నేరస్తుల్లో భయం ఏర్పడుతుందని, నింధితులను సులువుగా పట్టుకునే వీలుంటుందని పలువురు పేర్కొంటున్నారు.

పల్లెల్లో పగలు ఇళ్లు ఖాళీ..

మండలంలోని అన్నిగ్రామాల్లో వ్యవసాయమే ప్రధాన వృత్తిగా పెట్టుకొని ప్రజలు జీవనోపాధి పొందుతున్నారు. ప్రజలు ఇంటికి తాళాలు వేసి వ్యవసాయ పనులకు వెళ్తుండగా ఎప్పుడు ఏం జరుగుతుందో అని భయపడుతున్నట్లు ప్రజలు తెలుపుతున్నారు. మంచిర్యాల-చెన్నూర్ జాతీయ రహదారి పక్కనే భీమారం మండల కేంద్రం ఉండటంతో నిఘానేత్రాలు ఎంతో అవసరం. మరోపక్క మహారాష్ట్ర నుంచి కూడా భీమారం మీదుగా రాకపోకలు కొనసాగిస్తున్నారు. రానున్న రోజుల్లో ఇతర రాష్ట్రాల నేరస్తుల నుంచి మండల ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకొని నిఘానేత్రాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక నిధులు కేటాయించాలి

గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలి. ప్రజల సహకారంతో పాటు ప్రభుత్వం కూడా దీనిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటే ఎంతో బాగుంటుంది. అవసరం లేని పనులకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించే ప్రభుత్వం, ప్రజలకు ఉపయోగపడే కెమెరాలు ఏర్పాటుకి నిధులు కేటాయించాలి.

- లక్ష్మణ్, యువకుడు, ఆరెపల్లి

ప్రజల సహకారంతో ఏర్పాటు చేస్తాం

గ్రామాల్లోని అన్ని ప్రధాన వీధుల్లో ప్రజల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. గతంలో ఉన్న కెమెరాల పరిస్థితిని తెలుసుకొని, వాటి స్థానంలో కొత్తవి బిగిస్తాం. ఈ విషయంలో ప్రజలు సహకరించాలి.

- శ్వేత, ఎస్సై, భీమారం

మున్సిపల్ సమావేశంలో ఏడు తీర్మానాలు



సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్, అధికారులు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీలో కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మొత్తం ఏడు అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో హైమాస్ట్ లైటింగ్, స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటుతో పాటు సుందరీకరణ చేయుటకు, గాంధారి మైసమ్మ ఆలయం వద్ద మరుగుదొడ్లు నిర్మించేందుకు రూ.63లక్షలు పట్టణ ప్రగతి నిధుల నుంచి ఖర్చు చేసేందుకు ఆమోదం తెలిపారు. పట్టణంలోని గాంధీ విగ్రహం, జయశంకర్ విగ్రహం, అంబేడ్కర్ విగ్రహం వద్ద మరమ్మతులతో పాటు సుందరీకరణ కోసం రూ.5లక్షలు ఖర్చు చేసేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. గాంధారి ఖిల్లా వద్ద సోలార్ లైటింగ్, సోలార్ ఆర్వో ప్లాంట్ కోసం రూ.44లక్షలు వెచ్చించేందుకు ఆమోదం తెలిపారు. అన్ని వార్డులలో రోడ్లు, డ్రెయినేజీల ఏర్పాటు కోసం రూ.కోటి పది లక్షలు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసేందుకు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రాజు, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, మేనేజర్ స్వామి, డీఈ సుమతి, రెవెన్యూ అధికారి సతీష్, ఏఈ అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై వినీల

భీమారం/దండేపల్లి/లక్సెట్టిపేట/బెల్లంపల్లి/మంచిర్యాల క్రైం/మంచిర్యాలరూరల్(హాజీపూర్): శాంతి, భద్రతల సంరక్షణతో పాటు సైబర్ నేరాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ సహకరించాలని, అప్రమత్తంగా ఉండాలని పోలీసులు కోరారు. సైబర్ జాగృత దివస్‌ను పురస్కరించుకొని పలు మండలాల్లో విద్యార్థులకు, ప్రజలకు పోలీసు అధికారులు బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అపరిచిత వ్యక్తుల నుంచి మొబైల్ ఫోన్‌లకు వచ్చే ఎలాంటి లింక్‌లు తెరవొద్దని, ఇంటి వద్ద ఉంటూ సోషల్ మీడియాల్లో ఉపాధి పొందండి వంటి ప్రకటనలు నమ్మవద్దని, బ్యాంక్ అధికారులం అంటూ ఫోన్ చేసి ఓటీపీ చెప్పాలని అడిగితే చెప్పొద్దని, ఆన్‌లైన్‌లో టాస్క్(స్పిన్ వీల్స్)లు ఆడితే డబ్బులు వస్తాయని పంపించే అపరిచిత లింక్స్, బెట్టింగ్ యాప్స్ జోలికి అస్సలు వెళ్లవద్దని పలు సైబర్ మోసాలపై వివరణాత్మకంగా తెలియజేశారు. ఇక సైబర్ మోసాల బారిన పడితే వెంటనే 1930 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో బెల్లంపల్లిలో ఎస్సైలు కె.మహేందర్, సీహెచ్.రమేష్, హాజీపూర్‌లో ఎస్సై గోపతి సురేశ్, లక్సెట్టిపేటలో అదనపు ఎస్సై రామయ్య, భీమారంలో ఎస్సై శ్వేత, జిల్లా కేంద్రంలో ఎస్సై వినీత, బ్లూకోర్టు సిబ్బంది రాజన్న, సత్యనారాయణ, భరత్, రవి, మీనాక్షి, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- డీపీవో వెంకటేశ్వర్‌రావు



పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న డీపీవో

చెన్నూర్: విద్యార్థులకు కామన్ మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం ఎలా పెడుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్రవంతి, ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్అలీ, పంచాయతీ కార్యదర్శులు మౌనిక, సత్యనారాయణ పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త సేకరణ సక్రమంగా చేపట్టాలి

చెన్నూర్‌రూరల్: గ్రామాల్లో ఇంటింటికీ ట్రాక్టర్ ద్వారా తడి, పొడి చెత్త, ప్లాస్టిక్ సేకరణ సక్రమంగా చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. మండలంలోని కొమ్మెర, ముత్తరావుపల్లి గ్రామాలను బుధవారం ఆయన సందర్శించారు. ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్అలీ, పంచాయతీ కార్యదర్శులు మౌనిక, సత్యనారాయణ ఉన్నారు.

పతంగుల దుకాణాలపై దాడులు



తనిఖీ చేస్తున్న అటవీ అధికారి

జన్నారం/దండేపల్లి: పతంగుల దుకాణాలపై అటవీశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. జన్నారం మండల కేంద్రంలో, దండేపల్లి మండలంలోని ముత్యంపేట, తాళ్లపేట గ్రామాల్లో కిరాణ, జనరల్ స్టోర్స్‌లలో బుధవారం చైనాకు చెందిన మంజా దారం అమ్మకాలను నిషేధించడం వల్ల అమ్మకాలు కొనసాగించవద్దని ముందస్తు హెచ్చరికలు జారీ చేసి తనిఖీలు నిర్వహించారు. డిప్యూటీ రేంజ్ అధికారి తిరుపతి, అటవీశాఖ సిబ్బంది గోవింద్, రహిమోద్దీన్ పాల్గొన్నారు.

ఆవులు తరలిస్తున్న వ్యక్తిపై కేసు

జన్నారం: ఎలాంటి అనుమతి లేకుండా ఆవులను తరలిస్తున్న మహ్మద్ ఖాన్‌పై కేసు నమోదు చేసి ఆవులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. బుధవారం స్టేట్ బ్యాంక్ ప్రాంతంలో తనిఖీ చేస్తుండగా మహ్మద్ ఖాన్ ట్రాలీ ఆటోలో రెండు ఆవులు తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. ఎటువంటి రశీదు లేకపోవడంతో కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆవులు

సంక్షిప్త వార్తలు

ఆర్టీసీ డిపోలో రక్తదానం

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మంచిర్యాల ఆర్టీసీ డిపోలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పది మంది కార్మికులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ దేవపాల, ఆసుపత్రి వైద్యుడు శౌర్య, రెడ్‌క్రాస్‌సొసైటీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ ఏఎంసీ ఏరియా ఏసీపీ కార్యాలయం ఎదుట బుధవారం ఓ లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఏఎంసీ చౌరస్తా వద్ద లారీని వెనక్కి తీసుకునే క్రమంలో స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగి పక్కనున్న సీఎస్ఐ స్కూల్ ప్రహరీపై పడింది. తృటిలో ప్రమాదం తప్పింది. స్థానికులు ఎన్పీడీసీఎల్ పట్టణ ఏఈ మల్లేశం, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లగా.. ఘటనాస్థలిని పరిశీలించి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఘనంగా జెండా పండుగ

తాండూర్/భీమిని: తాండూర్ మండలం కిష్టంపేట గ్రామంలో, కన్నెపల్లి మండల కేంద్రంలో బుధవారం భీమ దేవర జెండావిష్కరణలో భాగంగా ఆదివాసీ కొలవార్ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నాపెద్దా తారతమ్యభేదం లేకుండా సాంప్రదాయ నృత్యాలు చేశారు. డోలు వాయిద్యాలతో హోరెత్తించారు. సల్లంగా చూడాలని భీమదేవరను వేడుకున్నారు.

రేషన్ డీలర్ తీరుపై ఆగ్రహం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ కాలనీ ప్రగతి మైదానంలో సమీపంలో రేషన్‌డీలర్ తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రేషన్ కోసం వచ్చిన లబ్ధిదారులు లైన్‌లో నిల్చున్నారు. సదరు రేషన్ డీలర్ బియ్యం కుప్పపైనే నిలబడి బియ్యం పోయడం మొదలు పెట్టాడు. దీంతో లబ్ధిదారులు పరబ్రహ్మ స్వరూపమైన బియ్యంపై నిలబడొద్దు, కాళ్ల కింద తొక్కిన బియ్యం ఇంకొకరికి ఎలా పోస్తారని డీలర్‌ను నిలదీశారు. నా ఇష్టం బియ్యం తీసుకొంటే తీసుకోండి.. లేకుంటే వెళ్లండి అని డీలర్ దురుసుగా మాట్లాడారని లబ్ధిదారులు వాపోయారు. కొందరు యువకులు ఈ సన్నివేశాన్ని ఫొటోతీసి సోషల్ మీడియాలో పోస్టు చేసి డీలర్ వైఖరిని ఎండగట్టారు. సదరు డీలర్‌పై సివిల్‌సప్లయీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పురుడు పోసిన 108సిబ్బంది

కాసిపేట: మండలంలోని సోనాపూర్ నాయకపుగూడకు చెందిన కనక మౌనికకు బుధవారం 108సిబ్బంది ఈఎంటీ దుర్గం ఆత్మరావు, పైలెట్ అసాద్ పాషా పురుడు పోశారు. ఆమె ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. వారిని కాసిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

దండేపల్లి: తెలంగాణ బయోఫోరం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన బయోలాజికల్ సైన్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో దండేపల్లి మండలం గుడిరేవు ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థి గంగధరి అంజి అత్యంత ప్రతిభ కనబరిచాడు. రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా అతడిని పాఠశాల ఆవరణలో బుధవారం అభినంధించారు.

తాండూర్‌లో..

తాండూర్: రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో తాండూర్ మండల విద్యాభారతి ఉన్నత పాఠశాల విద్యార్థులు శివచరణ్ చారి, మోక్షిత్, నందిత,హైందవి, ద్వారకవర్మ, రణదీప్‌సింగ్, సాయివదన్ ప్రతిభ చాటారు. వీరిని తైక్వాండో సెక్రెటరీ, కరాటే మాస్టర్ బోగ రాజేశ్, తైక్వాండో అధ్యక్షుడు చిరంజీవి, పాఠశాల డైరెక్టర్ సురభి శరత్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

బొగ్గుబాయి వార్తలు

11న జీఎం కార్యాలయం ఎదుట ధర్నా



మాట్లాడుతున్న అఫ్రోజ్ ఖాన్

శ్రీరాంపూర్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఈ నెల 11న శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ తెలిపారు. శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో బుధవారం కాంట్రాక్ట్ కార్మికులతో మాట్లాడారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కోలిండియాలో అమలవుతున్న కనీసం హై పవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, మైన్స్ యాక్ట్ ప్రకారం లీవులు, సిక్‌లీవులు, పండుగ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్, నాయకులు తిరుపతి, వీరేశం, సాయి రాజు, అశోక్ రెడ్డి, గుణిగంటి అశోక్, లక్ష్మణ్, పర్వతాలు కోమల పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికుల సమావేశాన్ని జయప్రదం చేయండి

కాసిపేట: 11న బెల్లంపల్లిలో నిర్వహించే రిటైర్డ్ కార్మికుల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్ కోరారు. సోమగూడెంలో బుధవారం మాట్లాడారు. రిటైర్డ్ కార్మికులు బియ్యాల వెంకటస్వామి, కుందేల్ల సంజీవ్, కట్ట యాదగిరి, రత్నం ఐలయ్య, గోవర్ధన్, దాడి గట్టయ్య, దుర్గం పోశం, దాగం రాయలింగు తదితరులున్నారు.

పరిశుభ్రతతో వైరస్‌కు దూరం

- జీఎం ఎల్వీ సూర్యనారాయణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న జీఎం సూర్యనారాయణ

శ్రీరాంపూర్: పరిశుభ్రతతోనే ఏ వైరస్ నైనా దరిచేరకుండా కాపాడుకోవచ్చని శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ తెలిపారు. శ్రీరాంపూర్‌లోని ఆర్కే 8 డిస్పెన్సరీలో బుధవారం హెచ్‌ఎంపీవీ వైరస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కంపెనీ వైద్య, ఆరోగ్య శాఖ వైరస్‌పై అవగాహన కల్పిస్తూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులు సబ్బుతో కడుక్కోవాలన్నారు. జలుబు, దగ్గు ఉంటే మాస్కులు ధరించాలన్నారు. వైరస్ సోకిన వారు తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం సీసీసీలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో వైద్య అధికారులు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, డీవైసీఎంవో రమేశ్‌బాబు, వైద్యులు దీప్తి, మనిషా, లోకనాథ్ రెడ్డి, సెక్రెటరీ విజయలక్ష్మి, డిప్యూటీ సూపరింటెండెంట్ ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలి

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ప్రభుత్వానికి స్వాధీనం చేసిన క్వార్టర్లకు ఓ కుట్ర పూరితంగా విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నారని డీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీపీ తొంగల మల్లేష్ అన్నారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని, తమ ఎమ్మెల్యేను బద్‌నామ్ చేయడం కోసం కొందరు కుట్ర పూరితంగా వ్యవహరించారని పేర్కొన్నారు. సింగరేణి క్వార్టర్‌లకు కరెంట్ తీసేయడం, ఎమ్మెల్యేను ప్రజల్లో అభాసు పాలు చేయడానికి చేసిన కుట్రలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్మికులకు స్వాధీనం చేసిన, చేయబోనున్న క్వార్టర్లకు సింగరేణి యాజమాన్యం బేషరతుగా విద్యుత్ సరఫరాను పునఃరుద్దరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పొట్ల సురేష్, ముస్లిం మైనార్టీ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు అమానుల్లాఖాన్, కాంగ్రెస్ పట్టణ మైనార్టీ అధ్యక్షుడు గౌస్, శంకర్ పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ కవిత విమర్శలు సత్యదూరం'

తాండూర్: కాంగ్రెస్‌పార్టీ, ఐఎన్‌టీయూసీ సంఘాన్ని ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన విమర్శలు సత్యదూరమని ఐఎన్‌టీయూసీ సింగరేణి విభాగం బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ తెలిపారు. బెల్లంపల్లి ఏరియా స్టోర్, వర్క్‌షాప్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికుల సమస్యలు, హక్కుల కోసం ఐఎన్‌టీయూసీ చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. ఎమ్మెల్సీ కవిత తప్పుడు ప్రచారం సాగిస్తున్నారని ఆరోపించారు. విమర్శలను తీవ్రంగా ఖండించారు.

'క్లర్కుల సమస్యలు పరిష్కరిస్తాం'

శ్రీరాంపూర్: సింగరేణిలో క్లర్కుల సమస్య పరిష్కరిస్తామని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య తెలిపారు. ఆర్కే న్యూటెక్, ఆర్కే 7, ఎస్సార్పీ 1, ఎస్సార్పీ 3 గనులపై బుధవారం ఏఐటీయూసీ క్లరికల్ సబ్ కమిటీ సమావేశాలు జరిగాయి. క్లర్కులు ఎదుర్కొంటున్న సమస్యలను సబ్ కమిటీ ద్వారా పరిష్కరించుకొనే అవకాశం కల్పిస్తున్నామన్నారు. జీఎం, కార్పొరేట్ స్థాయిలో జరిగే స్ట్రక్చర్ సమావేశాల్లో వీటిని చర్చిస్తామన్నారు. క్యాడర్ స్కీం, ప్రమోషన్ పాలసీ, హక్కులు, సదుపాయాలను ప్రధాన్యతగా గుర్తించి వాటి అమలుకు కృషి చేస్తామన్నారు.

రిటైర్డ్ ట్రామర్ కార్మికుల అపూర్వ సమ్మేళనం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే-5గనిలో ట్రామర్‌గా పనిచేసి రిటైర్మెంట్ అయిన కార్మికులు బుధవారం ఆ గని ఆవరణలో కలుసుకున్నారు. ఆప్యాయతగా పలుకరించుకొని క్షేమసమాచారాలు అడిగి తెలుసుకున్నారు. గని పరిసరాలను తిరిగి చూసారు. మున్షిగా విధులు నిర్వహించిన పలువురిని శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అందరూ కలిసి సహపంక్తి బోజనం చేశారు. మందమర్రి ఏరియాలో ఈ రిటైర్డ్ కార్మికుల సమ్మేళనం చర్చనీయాంశంగా మారింది.



కేకే-5 గనిపై అధికారులతో రిటైర్డ్ ట్రామర్ కార్మికులు

వ్యవసాయ నల్ల చట్టాలు రద్దు చేయాలి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని భారత రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి తిరుపతి అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్, నాయకులు మల్లన్న, కిష్టయ్య, శ్రీ కాంత్, అరుణ, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.